# సౌకర్యం

"హడావిడిగా అన్నం తింటున్నాను! వెళ్లి ఆ ఫోన్ ఎవరో చూడచ్చుకదా!" అన్నాడు విజయ్.

"మొన్న మీరుభోజనం చేసేటప్పుడు వచ్చిన ఫోన్ ఎవరో అని వెళ్తే అవతలతను సరిగ్గా చెప్పకపోవడం వల్ల నేను రావడం ఆలస్యమైందని మీరు అన్నం తినడం మానేసి, మజ్జిగ పోనుకోకుండా చెయ్యి కడిగేనుకుని ఆఫీస్‌కి వెళ్ళిపోయారుకదా! అప్పటి నుంచి ఫోన్ మోగితే భయంగా ఉంది" అంది భార్య వసుంధర.

"సర్లే! సంతోషం! సరిగ్గా అన్నం తినేటప్పుడూ, ఆఫీసుకు టైమ్ అయిపోయినప్పుడు వస్తాయి ఈ వెధవఫోన్లు. దేశంలో పెద్ద నిరుద్యోగ సమస్య.... పనిలేని వాళ్లకి ఫోన్స్ చెయ్యడమే పని" అని విసుక్కుంటూ వెళ్ళి ఫోన్ మాట్లాడి, ఆ ! వడ్డించు "ఆఫీసుకిటైమ్ ఆయిపోతోంది" అని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

'అడగకూడదు గానీ ఎవరండీ! ఫోన్ చేసింది" అంది వసుంధర.

"ఎవడో వల్లకాట్లో రామానాధాయిట! కాకినాడ నుంచి ఎస్.టి.డి. చేశాడు. పంపిస్తానని చెప్పిన పదివేల రూపాయలు వెంటనే పంపమన్నాడు. ఫోన్ చేసేటప్పుడు వీళ్లకి ఒళ్లు తెలీదు. ఒక్క నెంబరు తప్పు నొక్కినా ఆ ఫోన్ నాలాంటి సంబంధం లేని అభాగ్యులకు వస్తుంది. ఆఫీసుకి వెళ్లే హడావిడిలో వున్నా, అన్నం తింటూన్నా ఫోన్ మాత్రం చూడక తప్పదుకదా!" అన్నాడు విజయ్.

"పోన్లెండి, అంత కోపం ఎందుకండీ! పాపం ఆయనకి డబ్బు అర్జంటుగా అవసరమేమో" అంది.

"ప్రపంచంలో ప్రతీవాళ్ళకీ డబ్బు అవసరమే! నాకు కూడా ఒక పదివేలు అర్జంటుగా కావాలి, సర్దుతావా!" అని పప్పు అన్నం తినడం మానెసి మజ్జిగ పోసెయ్యమన్నాడు.

కళ్లు తుడుచుకుంటున్న భార్యను చూసి "చిన్నమాటంటే చాలు అలా ఏడుస్తూ వుంటావు. ఇప్పుడు నేనేమన్నానని ఏడుస్తున్నావు. వాడెవడో కాకినాడ నుంచి

ఫోన్ చేసినవాడిమీద చూపే జాలిలో సగం నా మీద ఎందుకు చూపించవు'' అంటూ ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

''వెధవ ఫోను! అస్తమానూ దీనివల్ల గొడవలే! ఈ ఫోన్ తీయించెయ్యాలి'' అనుకుంది.

రోజు పొద్దున్నే విష్ణు సహస్రనామ పారాయణం చేసుకుంటాడు విజయ్. ఒక రోజు మంచి తన్మయత్వంలో ఆ పారాయణం చేసుకునేటప్పుడు ఫోన్ మోగింది. భార్య అక్కడ దగ్గర్లో లేదు.

సరే! పారాయణం ఆపి వెళ్లి ఫోన్ ఎత్తాడు. అవతలనుంచి ''గోదావరి వచ్చి అరగంట అయింది ఏమిట్రా ఇంకా స్టేషన్‌కి రాలేదు. నువ్వు ఇలా చేస్తే ఎలాగరా! విజయ్'' అన్నాడు అవతలతను.

''ఎవరండీ మీరు! నేను స్టేషన్‌కి రావడం ఏమిటి? మీ పేరు ఏమిటి!'' అని అడిగాడు విజయ్.

''హార్నీ గొంతు గుర్తు పట్టలేదురా!'' అన్నాడు అవలతను.

''అదే కొంచెం గుర్తుపట్టాను. శీతాకాలం కదండీ అయినా ప్రయాణం కూడాచేసి వచ్చారు. అందుచేత కష్టంగా ఉంది'' అన్నాడు విజయ్, బాగుండదని.

''నేనురా కృష్ణారావుని! వైజాగ్ నుంచి వచ్చాను''

''నాకు కృష్ణారావు అని వైజాగ్‌లో తెలుసున్న వాళ్లు ఎవరూ లేరండీ''

''ఛస్తున్నాన్రా విజయ్'' అర్జునుడికి, శ్రీకృష్ణుడు గీతోపదేశం చేసినట్లు చెప్పవలసి వస్తోంది'' అన్నాడు అవతలతను.

''బాబూ ఉపదేశం ఆపి, ఆసలు మీకే నంబరు కావాలో చెప్పండి'' అన్నాడు విజయ్.

''ఫలానా నంబర్ కావాలని'' చెప్పాడు ఆవతలతను.

''క్షమించాలి. మా నెంబరు ఫలానా.... మీరు బహుశా తొందర్లో ఆయిదు నొక్కబోయి ఎనిమిది నొక్కుంటారు. రాంగ్ నెంబర్'' అని ఫోన్ పెట్టేశాడు విజయ్.

ఈలోపు వసుంధర స్నానం ముగించుకొని వచ్చింది. ''ఏమిటండీ గట్టిగా

చదువుతున్న పారాయణం ఆపేసి ఎవరితోనో ఫోన్లో కోపంగా మాట్లాడుతున్నారు" అని అడిగింది.

"ఆ ఏముందీ! మళ్ళీ తెల్లవారిందికదా! ఎవడో కృష్ణారావుట. గోదావరిలో వైజాగ్ నుంచి వచ్చాట్ట" అన్నాడు.

"ఎంత అదృష్టమండీ! విష్ణు సహస్రనామ పారాయణం చేసుకునేటప్పుడు కృష్ణారావు అనే ఆయన మీతో మాట్లాడటం! మీ పారాయణం ఫలిస్తోందన్నమాట".

"ఏదో రాంగ్ కాల్! పారాయణం ఫలించడం ఏమిటి! అసలు ఇంట్లో పూజలు కూడా శ్రద్ధగా చేసుకోవడానికి వీల్లేకుండా పోతోంది. ఆ వైజాగ్ నుంచి గోదావరిలో వచ్చినవాడు రాజమండ్రి దగ్గర గోదావరిలో దిగిపోయినా బాగుండేది" అన్నాడు విజయ్. "తప్పండీ" ఒక నిండు ప్రాణం గోదావరిలో దిగిపోతే బాగుండునని అనకూడదు అంది భార్య.

"గోదావరి అంటే గోదావరినది కాదే గోదావరి స్టేషన్" అంటూ, "నువ్వు వెళ్ళి తొందరగా వంటతగలెయ్యి. రోజు ఆఫీసుకి లేటవుతోంది.

'అన్నింటికి విసుగే ఈయనకి' ఏదైనా అంటే జీతం చాలటం లేదని, ఆఫీసులో పని అంతా తన నెత్తిమీదే పడుతోంది అని మొదలుపెడతాడు అందరూ సంసారాలు చేసుకోవడంలేదా! అనుకుంటోన్న సమయంలో తన పెళ్ళిచూపుల్లో వాళ్ళ అన్నయ్య "ఏమిటే ఈ పెళ్ళికొడుకు! మొత్తం ప్రపంచభారం అంతా తన భుజాల మీద మోస్తున్నట్లు పెడతాడు వీడి భుజాలూ, మొహమూనూ' అన్న మాటలు గుర్తొచ్చి, నవ్వుకుంది.

విజయ్ పూజ అయ్యేసరికి పక్కింటాయన వచ్చాడు. మా ఫోన్ మూగబోయింది కంప్లైంట్ యివ్వాలి "మీ ఫోన్ ఒకసారి వాడుకోవచ్చా" అంటూ అడిగాడు.

"మూగ పోయిందట ఎంత సినీ కవి అయితే మాత్రం తెల్లారితే అదే భాషా" అనుకుంటూ "కానివ్వండి" అన్నాడు విజయ్.

ఆయన వెళ్ళిన తర్వాత 'అసలు ఫోన్ డెడ్ అయితే కొంచెం విరామం దొరికినందుకు సంతోషించాలిగాని ఎవరో పోయినట్లు ముఖం పెట్టుకుని ఏడుస్తారేమిటి వీళ్లు?" అనుకున్నాడు.

సరిగా ఆఫీసుకు వెళ్తుంటే తన భార్య స్నేహితురాలు ఢిల్లీ నుంచి వచ్చింది.

"ట్రైన్ లేటయింది. అంచేత రావడం ఆలస్యం అయింది. లేకపోతే అసలు పొద్దునే రావలసింది" అని ఆవిడ చెపుతూన్న మాటలు విన్న విజయ్ "పొద్దునే ఒక కృష్ణ నామధేయుడు తగులుకున్నాడు తల్లీ! నీవు రాకపోవడం వలన ఏ కార్యక్రమాలూ కుంటుపడలేదు అన్నీ యధావిధిగా జరుగుతున్నాయి" అనుకున్నాడు, స్వగతంగా.

అసలు ఆవిడంటే విజయ్‌కి మంట అస్తమానూ ఇతర ఊళ్లకి ఫోన్లు చేస్తూంటుంది. ఢిల్లీలో పెద్ద మహిళా నాయకురాలు! మధ్య, మధ్యలో ప్రధానమంత్రిని కూడా కలుస్తుందని ప్రతీతి. ఈవిడంటే విజయ్‌కి భయం, తన భార్యచేత ఏ మహిళా కోర్టులోనైనా గొడవ పెట్టిస్తుందేమో అని. తన మీద తరచూ విసుక్కుంటాడని ఈవిడికి వసుంధర చెప్పే ఉంటుంది.

పైగా ఈవిడ ట్రంక్ కాల్స్ చేసేటప్పుడు "ఇక్కడ నుంచి ఎందుకులెండి! దగ్గర బూత్ నుంచి చేస్తానంటుంది" అది విని వసుంధర, 'ఏమిటే నువ్వు మరీను! మనది ఇప్పటి స్నేహమా! హైస్కూల్ నుంచీ చదువుకున్నవాళ్ళం. ఇరవై సంవత్సరాల బంధం మనది. ఇంతోటి ఫోన్లూ ఇక్కడి నుంచే చేసుకో" అంటుంది.

"ఏమిటో ఇరవై ఏళ్ల బంధం అయితే వేలకి వేలు టెలిఫోన్ బిల్లు తెప్పించాలా" అని బాదపడుతుంటాడు విజయ్.

ఆ మర్నాడు స్నానం చేసి, పూజ చేసుకుందామనుకుంటున్న విజయ్‌తో మొదటి సారిలాగే 'ఎట్టి పరిస్థితుల్లోనూ మా ఫ్రెండ్‌ని బయటికి వెళ్లనీయకండి. ఫోన్లు ఇక్కడ నుంచే చేసుకోమనండి. నేను స్నానం చేసి వస్తాను" అంది వసుంధర.

సరే ఈవిడ బయటికిపోతే భార్య బాధపడుతుందని ఆవిడ ఎదురుగా కూర్చొని 'ఆ, ఇంకేంటండీ' ఢిల్లీ విశేషాలు' అన్నాడు విజయ్.

నేను మిమ్మల్ని గమనిస్తూనే ఉన్నాను. కిందటిసారి కూడా మీ భార్య బాత్‌రూమ్‌కి వెళ్ళినప్పుడు నా ఎదురుగా కూర్చుని ఇలాగే 'ఢిల్లీ విశేషాలు ఏంటి' అని అడిగారు. రోజు పేపరు చూసే అలవాటు చేసుకోండి! ఇతరులు పేపరు చదివి చెప్పే విశేషాల మీద ఎన్నాళ్లు ఆధారపడతారు. ఇది లాస్ట్ వార్నింగ్ మీకు! ఈసారి మీ ఆవిడతో చెపుతాను. ఆవిడ వెళ్లగానే నా ఎదురుగా కూర్చోవడం అదీ చాలా తప్పు. మా ఫ్రెండ్ అమాయకత్వమే మిమ్మల్ని ఇలా చేస్తోంది" అంది కళ్లు ఎర్రచేసి.

"ఇదేమిట్రా భగవంతుడా! అసలు ఈ ఫోన్ పెద్ద దరిద్రం! ఎంతెంత మాటలుపడ్డాడు తను. ఈ రోజు పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశాడో ఏమో! ఎవరిదో ఏం ఖర్మ ఈ రోజు తన భార్య స్నేహితురాలి మొహమే చూశాడు. ఆ మాట పైకంటే ఇంకేమైనా ఉందా చంపేస్తుందీవిడ.

అనుకుంటుండగానే ఆవిడ బయటకెళ్ళిపోయింది.

"నేను బాత్‌రూమ్‌లో ఉన్నప్పుడు మా ఫ్రెండ్ బయటికి వెళ్ళలేదుకదా" అని అడిగింది వసుంధర.

"నీకూ నీ ఫ్రెండ్‌కీ మధ్య నేను చస్తున్నాను. అసలు ఈ వెధవ ఫోన్‌పోతేగాని నాకు మనశ్శాంతి ఉండదు అసలు ఈ ఫోన్ తీయించేస్తే సగం శని వదిలిపోతుంది" అన్నాడు విజయ్.

"మిగతా సగం శని నేనా! ఏదేమైనా నాఫ్రెండ్ ఇక్కడ ఉన్నన్ని రోజులూ ఈ ఫోన్ ఉండవలసిందే. ఇదిపోతే నేను పోయినట్లే" అంది.

"నువ్వెందుకే పోవడం! ఎప్పుడో అప్పుడు ఈ ఫోన్ బిల్స్ కట్టలేక నేనే పోతాను" అన్నాడు విజయ్.

"అయ్యో అలా అనకండీ! ఈ రోజు శుక్రవారం కూడా, మీరలా అనకండి" అని బాధతో మంగళసూత్రాలు కళ్ళకద్దుకుంది వసుంధర.

"ఫోన్ పోకూడదు నేను పోకూడదు తన స్నేహితురాలు ఫోన్ చెయ్యడానికి బయటికి పోకూడదు! ఏదీ పోకూడదు కాని, తన సంపాదన మాత్రం వృధా అయిపోవాలి" విసుక్కున్నాడు విజయ్.

కొన్నిరోజులు తర్వాత ఫోన్ బిల్లు ఆరువేల అయిదువందలకి వచ్చింది. ఈ బిల్లు కట్టలేకపోయాడు. భార్య గోలచేసింది "ఫోన్ బిల్లు కట్టండి, ఫోన్ లేకపోతే నలుగురిలో చిన్నతమని".

పాపం! అంతడబ్బులేదతని దగ్గర! ఫ్రెండ్‌కి ఫోన్ చేద్దామని రిసీవర్ చేతిలోకి తీసుకున్న విజయ్‌కి మీ ఫోన్‌కి ఈ సౌకర్యం లేదు" అని వినపడింది.

అంటే టెలిఫోన్ కట్ చేశారన్నమాట. ఆ సంగతి వసుంధరతో చెప్పగానే, "అయ్యో ఎంత అసౌకర్యం" అంది. "మధ్య తరగతివాళ్ళకి కొన్ని, 'అసౌకర్యాలు'

కూడా 'సౌకర్యాలేలే! ఇంకేం మాట్లాడకు. ముందు ఒక స్ట్రాంగ్ కాఫీ పట్రా' అంటూ వాలుకుర్చీలో సాగిలపడి కూర్చుని కళ్లు మూసుకున్నాడు విజయ్.

రాత్రి పది గంటలకు పక్కింటి ఆయన వచ్చి 'ఒక చిన్న సహాయంచెయ్యాలి. రేపు మేము ఎ.పి. ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వెళుతున్నాం కదా! మా ఫ్రెండ్ స్టేషన్‌కి వెళ్ళడానికి వాళ్ళ కారు పంపిస్తానన్నాడు. మా ఫోన్‌డెడ్ అయింది. మీ ఫోన్ నెంబర్ ఇచ్చాను. ఆ కారు వచ్చేముందు మీకు ఫోన్ చేస్తాడు. కొంచెం మా ఇల్లు చూపించండి. శ్రమ పెడుతున్నాను ఏమీ అనుకోవద్దని'' చెప్పాడు.

''అయ్యో దానికేం అన్నయ్యగారు!'' అంది విజయ్‌భార్య. అనుకున్నట్లుగానే తెల్లారకట్ల ఫోన్ వచ్చింది. ఆ కారు డ్రైవర్‌కి ఇల్లు చూపించి వచ్చేటప్పుడు, విజయ్‌ని ఒక కుక్క కరచింది. గట్టిగా అరిచాడు. అలా అరవకూడదేమో మరి! రెండవ కాలు కూడా కరిచింది.

పొద్దున్నే ఒక కుక్కకాట్ల వైద్యంలో ప్రసిద్ధికెక్కిన డాక్టరు దగ్గరికి వెళ్ళి, రెండు కాళ్లూ కుక్కకరచినట్లు చెప్పాడు.

డాక్టరు చాలా మంచాయన! "ఎన్నిచోట్ల కరచినా నేను ఫీజు మాత్రం ఎక్కువ చెయ్యను. ఇంజక్షన్లు కూడా అన్నే పడతాయి. ఇదే వైజాగ్‌లో మా బాబయ్య అయితే కరచినచోట చూసి, పడిన గాట్లను బట్టి శునకం పన్నుకి ఇంతని వసూలు చేస్తాడు'' అని చెప్పాడు.

"పెద్ద అదృష్టం మనం వైజాగ్‌లో ఉండకపోవడం" అన్నాడు విజయ్.

"ఊరుకోండి! డాక్టర్ వింటే బాగుండదు" అంది భార్య.

విజయ్‌కి ఇంజక్షన్ ఇవ్వడం అయిన తరువాత డాక్టరు తన ఫీజు వివరాల గురించి చెబుతూ, "ఒక మనిషిని మూడు నెలల్లోపు అదే కుక్క కరిస్తే అసలు ఫీజు తీసుకోను. మూడు నెలల నుంచి ఆరు నెలలోపు కరిస్తే ఫీజులో సగం తీసుకుంటాను. ఒకే కుటుంబంలో ఇంక ఎంతమందిని కరిచినా ఫీజులో పదిశాతం తగ్గిస్తా. ఎప్పుడు కుక్కకరచినా వెంటనే నా వద్దకు వచ్చెయ్యండి'' అన్నాడు.

''ఆ కుక్క దంపతులలో ఎవరు కరచినా ఇవే ఫీజు రూల్సా'' అని అడుగుదామనుకున్నాడు విజయ్, భార్య తిడుతుందని ఊరుకున్నాడు.

ఇంటికి వచ్చిన తరవాత "ఫీజులో తగ్గింపుందని మళ్ళీ కరిపించుకోకండి" అంది భార్య.

'సరేలే! ఈ ఫోన్ పోతేనేకాని శని వదలదు. ఇక ఈ బిల్లు కట్టను. ఆ డబ్బు ఉంటే కుక్కలు కరిస్తే వైద్యానికి పనికొస్తుంది. ఏమంటావ్!' అన్నాడు భార్యతో.

'ఈ ఫోన్ పెట్టినప్పటినుంచి అస్తమానూ ఆ ఫోన్‌ని తిట్టడం! నన్ను తిట్టడం! తీయించెయ్యండి. శాశ్వతంగా ఒక గొడవ వదిలిపోతుంది" అంది.

ఇంతలో ఫోన్ మోగింది.

(విపుల ఏప్రిల్ 2004)